క్లుప్తంగా

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ముత్యాల నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పలు పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించి ఓదార్చారు. నర్సయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, నాయకులు పిట్ట సురేశ్, బైరం భద్రయ్య, బుర్ర శ్రీధర్, రమణాచారి, పాండ్రాల స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, యూత్ అధ్యక్షుడు అల్లకొండ కుమార్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మన్, నాయకులు దొడ్డి కిష్టయ్య, బొట్ల రవి, బుర్ర శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్, తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



చిట్యాల: మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన జాతీయ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పసరగొండ రమేశ్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగెల్లి రమేశ్, చిట్యాల ఏపీఓ హలీం పాషా, నాయకుడు బొజ్జపల్లి శంకర్ పరామర్శించారు. మృతుడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట చిట్యాల, టేకుమట్ల, గణపురం, రేగొండ ఫీల్డ్ అసిస్టెంట్లు చెన్నూరి శంకర్, భీంపల్లి రామస్వామి, బండారి శ్రీనివాస్ ఉన్నారు.

పోలీస్ అమరవీరులకు ఘననివాళి



గోవిందరావుపేట: మండల పరిధి చల్వాయిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్ ఆధ్వర్యంలో కమాండెంట్ టి అలెక్స్ పోలీస్ అమర వీరులకు సోమవారం ఘన నివాళులర్పించారు. అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. సాయుధ పోలీసులు శోక్‌శ్రస్త్ చేసి అమరుల వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కార్తిక్, సాల్మన్ రాజ్, శ్రీనివాసులు , అన్నయ్య, రాంప్రసాద్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల క్యాంపు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు ఏడవ రోజుకు చేరింది. సోమవారం ఉదయమే యోగ ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు గంట పాటు వలంటీర్లకు యోగసానాలు నేర్పించారు. యోగలో ప్రొఫెసర్ పాండురంగారావు, క్యాంపు కోఆర్డినేటర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు. ఉదయం 10గంటలకు ప్రొఫెసర్ విజయ్‌బాబు వలంటీర్లకు దేవాలయాలు, టూరిజం మీద ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం తెలంగాణ పర్యాటక శాఖ చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి వలంటీర్లకు వివరించారు. తెలంగాణ టూరిజం ప్రదేశాలు వాటి విశిష్టత గురించి డాక్టర్ సూర్యకిరణ్ వివరించారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాత్రాపురం, నూగూరు, వెంకటాపురం, మరికాల, చొక్కాల గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సొహేల్, ఆశిష పవన్, వినయ్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

ములుగు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో మౌలిక వసతులు లేవని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనుమతులు లేకుండా జిల్లా కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్న అధికారులు మాత్రం పట్టించకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలు, జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బైరేష్, స్వామి, బాలు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర



టేకుమట్లలో డబ్బాలను తొలగిస్తున్న అధికారులు

రోడ్డు విస్తరణలో దుకాణాల తొలగింపు

- ఐదు రోజులుగా అడ్డుకున్న దుకాణాదారులు
- ప్రత్యామ్నాయం చూపించిన అధికారులు

టేకుమట్ల: మండల కేంద్రం నుంచి చిట్యాల మండలం నవాబుపేట వరకు గల ప్రధాన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఇటీవల నిధులు కేటాయించడంతో కొన్ని రోజులుగా రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాగా మండల కేంద్రం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రోడ్డు విస్తరణ పనులు కొనసాగడంతో మండల కేంద్రంలోని దుకాణ సముదాయాలు తొలగించేందుకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో యజమానులు తొలగించకుండా ఆందోళన చేపట్టడంతో ఐదు రోజులుగా రోడ్డు నిర్మాణ పనులకు తీవ్ర జాప్యం ఏర్పడింది.

రంగంలోకి దిగిన అధికారులు

రోడ్డు విస్తరణకు సహకరించాలని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓలు దుకాణ యజమానులకు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో మండల అధికారులు సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో సోమవారం రంగంలోకి దిగిన డీఎల్‌పీఓ వీరభద్రం, సీఐ మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎస్సై గోగికారి ప్రసాద్ పోలీస్ సిబ్బందితో డబ్బాలను తొలగించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో వెనక్కి తగ్గిన దుకాణ యజమానులు అధికారులకు ప్రత్యామ్నాయం చూపించాలని వేడుకున్నారు. ఈ మేరకు అధికారులు దుకాణాదారులకు వేరేచోట స్థలం చూపించారు. ఐదు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతల అనంతరం సాఫీగా డబ్బాలను తొలగించడంతో రోడ్డు విస్తరణ పనులు యథావిధిగా కొనసాగాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలతో పాటు, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల ప్రజలు వ్యాపార రిత్య నిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. ఇరుకు రోడ్లతో నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో విశాలమైన రోడ్డు ఉండాలని గత ఐదు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మండల ప్రజల కోరిక త్వరలోనే నెరవేరనుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యకు తెరపడింది



టేకుమట్ల–నవాబుపేట ప్రధాన రోడ్డు నిర్మాణంలో రోడ్డు విస్తరణకు దుకాణ యజమానులు డబ్బాల తొలగింపునకు నిరాకరించారు. అధికారుల చొరవతో తొలగింపునకు సహకరించారు. మరో చోట డబ్బాలను ఏర్పాటు చేసేందుకు హామీ ఇవ్వడంతో సమస్యకు తెర పడింది.

– గౌడ సురేశ్, ఎంపీపీ టేకుమట్ల

రోడ్డు సౌకర్యంతో అభివృద్ధి



గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు సౌకర్యం మెరుగుపడాలి. మండల కేంద్రం నుంచి నవాబుపేట రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇన్ని రోజులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంతా సమయంలో మరింత ఇబ్బంది ఉండేది . ప్రస్తుతం రోడ్డు విస్తరణతో మండలం మరింత అభివృద్ధి చెందుతుంది. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన వారికి అధికారులు ప్రత్యామ్నాయం చూపించడం సంతోషం.

– మొగిళి, బీజేపీ నాయకుడు, గుమ్మడవెల్లి

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రేగొండ: పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని ఉమ్మడి జిల్లా పరీక్షల కార్యదర్శి ఒంటేరు చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా అవగాహన చేసుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ నెల 28 వరకు జరుగనున్న పరీక్షల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు నవంబర్ 2న మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట డీసీఇబీ సహా కార్యదర్శి శనిగరపు భద్రయ్య, మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి ఉన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలిమెల, పెద్దంపేట ఇసుక క్వారీల నుంచి అంబట్‌పల్లి గ్రామం మీదుగా ఇసుక లారీలు తరలి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దాకు గ్రామస్తులు వినతిపత్రం ద్వారా సోమవారం తెలిపారు. బైపాస్ నుంచి తరలిపోయేల చర్యలు తీసుకోవాలని ఇసుక లారీలతో ప్రాణాలు పోతున్నాయని, దుమ్మూధూళితో పంట నష్టం వాటిల్లుతుందని, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్ట సూర్యానారాయణ, పత్తి మల్లేశ్, గుజ్జుల శంకర్, శ్రీనాథ్, సంతోష్, పి.దేవేందర్, దేవేందర్, బింగి రవి ఉన్నారు.

రోడ్లపై ధర్నాలు చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: పది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం 10నెలల్లో రూ.2లక్షల లోపు రైతుల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన అసత్య వ్యాఖ్యలు చేస్తూ రోడ్లపై ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నియంత పాలనలో ప్రజలు విసుగు చెంది, ప్రజాపాలనకు పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనను తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై ధర్నాలు చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా సిగ్గుమాలిన రాజకీయాలు మాని ప్రభుత్వానికి సహకరించాలని, లేని పక్షంలో ప్రజలు బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టే పరిస్థితి దాపురిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, మండల నాయకులు సదానందం, నాంపెల్లి వీరేశం, సంగి రవి, బండ శ్రీకాంత్, చిరంజీవి, శాస్త్రాల కిరణ్, తెలవేని రాజేందర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వినతి

ములుగు: తనకు, తన భూమికి రక్షణ కల్పించాలని కోరుతూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పాత పాలంపల్లి గ్రామానికి చెందిన పత్తి కొండ కోటేశ్వరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొండ కోటేశ్వరావు మాట్లాడుతూ.. తన తల్లి పత్తి వెంకటమ్మ పేరున వెంకటాపూర్(రామప్ప) మండల శివారులో సర్వే నం.1873/ఆలో నాలుగు ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిలో వరి పంట సాగు చేసుకుంటున్నానని, అట్టి భూమిని భూమారెడ్డి అనే వ్యక్తి అక్రమించుకోని ప్రొక్లెయినర్‌తో పనులు చేస్తున్నారని తెలిపారు. తన భూమిలో ఎందుకు పనులు చేసుకుంటున్నారని అడ్డుకుంటే బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ప్రాణాహానీ ఉందని తనకు తన భూమికి రక్షణ కల్పించి భూమిని అక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కాటారం: మంథని నియోజకవర్గంలోని పలు మండలాలకు నూతన రహదారుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామగ్రామాన ఎలాంటి అతంరాయం లేని రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకుకెళ్తున్న మంత్రికి మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, అయిత శకుంతల, చిటూరి మహేశ్, గద్దె సమ్మిరెడ్డి, కుంభం రమేశ్‌రెడ్డి, చీమల రాజు పాల్గొన్నారు.

వనదేవతల సన్నిధికి భక్తుడి పాదయాత్ర



భక్తుడితో పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా శ్రీసమ్మక్క–సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకునేందుకు ఓ భక్తుడు ఛతీస్‌గఢ్ రాష్ట్రం జగ్దల్‌పూర్ నుంచి మేడారానికి పాదయాత్రగా బయల్దెరాడు. స్వగ్రామం జురు నుంచి 20 రోజుల క్రితం మొదలైన పాదయాత్ర 350 కిలోమీటర్లు పూర్తి చేసి సోమవారం వనదేవతల సన్నిధికి చేరుకున్నాడు. తాడ్వాయి–మేడారం మార్గ మధ్యలో మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చుపటేల్, కాంగ్రెస్ నాయకుడు బొల్లు దేవేందర్, రేగ కళ్యాణి ఆ భక్తుడిని కలిశారు. మేడారంలో అతడికి వసతి కల్పించి దర్శనానికి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండీ.ముజఫర్, కోరం నందు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న పోలీసులు

కాళేశ్వరం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని మహదేవపూర్ సీఐ రామచంద్రరావు అన్నారు. మహదేవపూర్ మండలం అన్నారం గ్రామంలో సోమవారం ఎస్సై సీహెచ్ చక్రపాణితో కలిసి సీఐ 12 సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేరాలను నియంత్రించడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెహికల్ నంబర్ గుర్తించి నేరస్తులను పట్టుకోవడానికి కీలక పాత్ర వహిస్తాయన్నారు. రాత్రి సమయంలో దొంగతనాలు జరిగినప్పుడు దొంగలను గుర్తించడానికి సీసీ కెమెరాలతో గుర్తించవచ్చని తెలిపారు. నూతన చట్టాలు, సైబర్ నేరాలపై, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తుందన్నారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, గుట్కాలు అలవాటు చేసుకోని ఆరోగ్యం పాడు చేసుకోవద్దని తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన నిబంధనలను వివరించారు. ప్రజలు మావోయిస్టులకు సహకారం అందించడం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు పండించిన పత్తి పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు దిగుబడి రాక అనేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.7521 కల్పించాలని డిమాండ్ చేశారు. జిన్నింగ్ మిల్లులో గతంలో ఏ రైతుకు న్యాయం జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుకుంట్ల రాజేష్, కె.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సునీత

మొగుళ్లపల్లి: అర్హతగల ఉపాధ్యాయులందరూ బాధ్యతగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీత ముఖ్య అతిథిగా హాజరై ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియ నవంబర్ 6న ముగుస్తున్నందున ఆలోపు ప్రతి ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సౌకర్యం



ఏర్పాటు చేసిన చేతిపంపు

వాజేడు: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో వరంగల్‌కు చెందిన బాలవికాస్, వెంకటాపురం(కె)కు చెందిన కాఫెడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం చేతి పంపును ఏర్పాటు చేశారు. తాగు నీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు వచ్చి బోర్ వేయించి తాగునీటి సౌకార్యాన్ని కల్పించారు. కెనడాలోని పేరస్ ఉడ్ పాఠశాల విద్యార్థుల సహకారంతో ఈ బోరును వేసినట్లు బాలవికాస్ కోఆర్డినేటర్ ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు, కామేష్, ప్రధానోపాధ్యాయురాలు సునీత ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ మల్లేశ్

చిట్యాల: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఐ మల్లేశ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలానికి చెందిన 14 మంది యువకులు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్ రక్తదానం చేసిన యువకులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత ఈలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మిరప తోటల సందర్శన



మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు

రేగొండ(గోరికొత్తపల్లి): మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన చిరిపోతుల సాంబయ్య మిరప తోటలను మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి, ఉద్యాన శాఖాధికారి సునీల్‌కుమార్ సోమవారం సంయుక్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిర్చి పంటలో నులిపురుగుల వ్యాప్తి, తెగులును గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మిరప పంటల్లో నులి పురుగులు, తెగులు సమస్యకు ఎకరాకు ఐదు కిలోల 3జీ గులికలను 10కిలోల సన్నటి ఇసుకలో కలిపి మొక్క మొదళ్లలో చల్లాలన్నారు. అలాగే మూడు కిలోల తైసిలో మైసిన్ అనే బయో ఏజెంట్‌ని 100 కిలోల వేప పిండిలో కానీ పశువుల ఎరువుతో కలిపి పంటలో చల్లాలన్నారు. పంటలో ఇట్టి సమస్యను గుర్తించిన వెంటనే నీటి పారకాన్ని నిలిపి వేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తగిన మెలకువలు పాటించాలన్నారు. వారి వెంట రైతులు ఉన్నారు.

25న మాదిగల ధర్మ యుద్ధ మహాసభ



మాట్లాడుతున్న అంబాల చంద్రమౌళి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాల్లో మాదిగ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, ఈ మేరకు నిరసనగా ఈనెల 25న వరంగల్ జిల్లా కేంద్రంలో మాదిగల ధర్మ యుద్ధ మహాసభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రూప్1, గ్రూప్2 తో పాటు డిసెంబర్ నాటికి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ లేకుండానే వాటిని పూర్తిచేసే పనిలో ఉన్నారని మాదిగలను మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ, గాజుల భిక్షపతి మాదిగ, అంతడుపుల సురేష్, మంద తిరుపతి మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి మడిపెల్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వాజేడు : ప్రతీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యేతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని టేకులగూడెం, చంద్రుపట్ల, కృష్ణాపురం, పేరూరు, ధర్మవరం , ఎడ్జర్లపల్లి, గుమ్మడి దొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ముఖ్యంగా విద్యుత్, సాగు, తాగు నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కడేకల్ గ్రామస్తులు తమ గ్రామంలో అంగన్ వాడీ భవనం నిర్మించాలని కో రారు. కృష్ణాపురంలో లిఫ్టుకు విద్యుత్ సౌకర్యం క ల్పించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎ మ్మెల్యేకు వివరించారు. ఆరోగ్య ఉపకేంద్రానికి ప్ర హరీ ఏర్పాటు చేయించాలని కోరారు. అనంతరం పేరూరు వైద్య శాలను సందర్శించిన ఆయన నేరుగా రోగులతో మాట్లాడి వైద్యం ఏ విధగా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను పలు వురు వేడుకున్నారు. విద్యుత్ శాఖ సిబ్బందితో పా టు, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఎమ్మెల్యే వెంట ప్రతీ గ్రామ పంచాయతీకి హాజరయ్యారు. ముందుగా చంద్రుపట్ల గ్రామంలో ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ య గ్గడి అంజయ్య షాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జున రావు, మాజీ అధ్యక్షుడు వీరవెంకట సీతారామరాజు, నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు శారద, పుష్పలత, జగన్నాథరాజు, శరత్ ఉన్నారు.